ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
గురువారం 5 ఫిబ్రవరి 2026
www.prajaswaramdailly.com
4 PM

# 19 వరకు కూకట్‌పల్లి ఎస్ఈ రిమాండ్



**కూకట్ పల్లి, ప్రజాస్వరం**

**కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డికి ఈ నెల 19 వరకు రిమాండ్ నాంపల్లి కోర్టు విధించింది. చంచల్ గూడ జైలుకు చిన్నారెడ్డి తరలించారు. నిన్న కూకట్ పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా చిన్నారెడ్డి చిక్కారు.**



## రేవంత్ కు బూతులు తప్ప

# పాలన రాదు

**కేసీఆర్ జై తెలంగాణ అన్నారు**

**కానీ రేవంత్ రెడ్డి ఒక్కరోజైనా అలా అన్నాడా ? అని నిలదీశారు**

**గజ్వేల్ ప్రజ్ఞపూర్ లో మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్**

గజ్వేల్, ప్రజాస్వరం
రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ బూతులు తప్ప ఆయనకు పాలన రాదన్నారు, కేసీఆర్ జై తెలంగాణ అన్నాడు కానీ రేవంత్ రెడ్డి ఒక్కరోజైనా అలా అన్నాడా అని మాజీ మంత్రి హరీష్ ప్రశ్నించారు
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజ్ఞాపూర్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు.ఈ సభలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు,సభలో హరీష్ రావు మాట్లాడుతూ మనకు అన్నం పెట్టినవాళ్లకు మన కోసం పని చేసినవాళ్లకు ఓటు వేయాలన్నారు, గజ్వేల్ దవాఖాన ఒకప్పుడు పందులతో నిండి ఉండేది కేసీఆర్ హయాంలో అది ఎలా మారిందో ప్రజలకు తెలుసు అన్నారు,రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక బంగారం ధర ఎనబై వేల వరకు పెరిగింది కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు,ఉన్న పథకాలను కూడా ఎగ్గొట్టడం తప్ప ప్రజలకు కొత్తగా చేసిందేమీ లేదు అని విమర్శించారు,ఆడవారికి ఉచిత ప్రయాణమని చెప్పి మగవారికి డబుల్ టికెట్ వేశాడు అంటూ ఎద్దేవా చేశారు,మనకు అన్నం పెట్టింది పథకాలు అందించింది కేసీఆర్ రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని ధీమా వ్యక్తం చేశారు, రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ బూతులు తప్ప ఆయనకు పాలన రాదన్నారు, కేసీఆర్ జై తెలంగాణ అన్నాడు కానీ రేవంత్ రెడ్డి ఒక్కరోజైనా అలా అన్నాడా అని ప్రశ్నించారు,రైతు బంధు అంశంపై మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రైతు బంధు ఆగలేదు,ఇప్పుడు ఎందుకు ఆపారు? ఇప్పటికీ మూడు రైతు బంధు విడతలు ఎగ్గొట్టారు,ఎన్నికల తర్వాత ఇస్తానంటూ మాటలు చెబుతున్నారు అన్నారు,ఈ విషయంలో ఎన్నికల కమిషన్ కు లేఖ ఇస్తామని తెలిపారు,ముస్లిం సోదరుల విషయమై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు,గజ్వేల్ లో ఒక్క తట్టెడు మట్టికూడా ఎత్తలేదు అని వ్యాఖ్యానించారు,ప్రజ్ఞాపూర్ లో నిర్మించిన కమిటీ హాల్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటున్నారని సున్నం కూడా వేయని పరిస్థితి అని అన్నారు,పోరాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తోంది,రాష్ట్రం మొత్తం ఆగమై పోయింది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు,బీజేపీపై కూడా విమర్శలు చేస్తూ అక్షింతలు పంచడం తప్ప గజ్వేల్ కు ఒక్క రూపాయి పని చేశారా అని ప్రశ్నించారు,గజ్వేల్ బాగుండాలంటే కారు గెలవాలి బీఆర్ ఎస్ కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను దండం పెట్టి కోరుతున్నాను,మిగిలిన పనుల బాధ్యత నేనే తీసుకుని పూర్తి చేస్తా అని హరీష్ రావు అన్నారు.

# గ్రూప్1 అభ్యర్థులకు ఊరట

**ర్యాంకింగ్ లిస్టు రద్దు చేస్తూ అప్పట్లో సింగిల్ బెంచ్ తీర్పు**

**ఇప్పుడు సింగిల్ బెంచ్ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ కొట్టివేత**

హైదరాబాద్, ప్రజాస్వరం
గ్రూప్–1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. గ్రూప్ – 1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుని డివిజన్ బెంచ్ లో టీజీపీఎస్సీ , గ్రూప్–1 కి ఎంపికైన అభ్యర్థులు సవాల్ చేశారు.

**సీఎం హర్షం**

గ్రూప్–1 నియామకాలపై హైకోర్టు తీర్పును సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా న్యాయ పోరాటంలో విజయం సాధించామని హర్షం వ్యక్తం చేశారు.




## ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్

# కమాండర్ ఉధమ్ సింగ్ మృతి?

**ఛత్తీస్ గఢ్, ప్రజాస్వరం**

ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ కమాండర్ ఉధమ్ సింగ్ మృతిచెందినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్–బీజాపూర్ జిల్లా పెదగళూరు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఘటనాస్థలంలో ఆటోమేటిక్ ఏకే –47 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు.





# పవన్ వివరణ ఇవ్వాలి

**గతంలో పవన్ కళ్యాణ్ తెలంగాణ గురించి అనుచితంగా మాట్లాడారు : మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్ , ప్రజాస్వరం
పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేసే ముందు వివరణ ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గతంలో పవన్ కళ్యాణ్ తెలంగాణ గురించి అనుచితంగా మాట్లాడాడరని అన్నారు. నేను చిరంజీవికి అభిమానిని అని తెలిపారు. ఒక సినిమా నటుడిగా పవన్ కళ్యాణ్ ను మేం ఆదరిస్తాం అని చెప్పారు. కాని ఎన్నికల ప్రచారం కోసం పవన్ కళ్యాణ్ దగ్గర మోకరిల్లాల్సిన అవసరం బీజేపీకి ఎందుకు వచ్చింది? అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిలదీశారు.






# డీజీపీ శివధర్కు లైన్ క్లియర్

**హైదరాబాద్, న్యూఢిల్లీ, ప్రజాస్వరం**

తెలంగాణ డీజీపీ శివధర్ నియామకానికి లైన్ క్లియర్ అయ్యింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. శివధర్ రెడ్డి నియామకంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో సీజేఐ ధర్మాసనం ఏకీభవించింది. పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని యూపీఎస్సీకి ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఇన్చార్జి డీజీపీ నియామకాన్ని తప్పుబట్టలేమని నియామక ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# సామాన్య భక్తులే వీఐపిలు

**మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే జిఎంఆర్**

అమీన్ పూర్, ఫిబ్రవరి 05(ప్రజా స్వరం )
రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న మహా జాతర ఏర్పాట్లపై పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజులపాటు మహాశివరాత్రి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని తెలిపారు.
సామాన్య భక్తులే వీఐపిలు అనే భావనతో దర్శన ఏర్పాట్లు చేయాలని, వీఐపీ పేరుతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, రద్దీ నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపాలని, మూడు రోజులపాటు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిరంతర నిఘా కోసం 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బీరంగూడ గుట్టపై ఉన్న అక్రమణలను 24 గంటల్లోగా తొలగించాలని ఎమ్మార్వో వెంకటేష్‌ను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతర ఏర్పాట్లపై ఈనెల 12వ తేదీన మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, అప్పటి లోపు అన్ని పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, తహసిల్దార్ వెంకటేష్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ నరేష్, ఆలయ ఈవో శశిధర్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.